

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

పేదల శ్రేయస్సే బీజేపీ లక్ష్యం

కవాడిగూడ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదల శ్రేయస్సే బీజేపీ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం కవాడిగూడ ముగ్గుబస్తీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. లక్ష్మణ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి, పార్టీ కార్యకర్తలు ఖాదీ దుస్తులను ధరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీజన్స్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ హరిచరణ్, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు రంగరాజ్‌గౌడ్, జి. వెంకటేష్, పూసరాజు, ముషీరాబాద్ కన్వీనర్ ఎం రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన-సామాజిక న్యాయం అంశంపై

రేపు అఖిలపక్ష సమావేశం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారం సాధించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కొండాల లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ సెక్రటరీ జనరల్ రాపోలు జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కులగణన చేపట్టి స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ఈ నెల 25న సమగ్ర కులగణన - సామాజిక న్యాయం అనే అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. సమాశానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, తెలంగాణ ఉద్యమకారులు హాజరవుతారని చెప్పారు.



బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షన్ సవరణ చేపట్టండి

- బీఓబీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

బషీర్‌బాగ్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అఖిల భారత బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వై.జానకిరాం డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ జోనల్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం జోనల్ జనరల్ మేనేజర్ రితీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జానకిరాం మాట్లాడుతూ.. బ్యాంక్ యాజమాన్యం విశ్రాంత ఉద్యోగులపై ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. వెంటనే పెన్షన్ సవరణ చేసి, ఆరోగ్య బీమా పై ప్రీమియం తగ్గించి, జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం నేతలు పి. రఘురాం రెడ్డి, డి. సుచిత్ర, జ్ఞానేశ్వర్, టి. హనుమంతురావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిచాణా ఎత్తేసిన 'లోటస్ హాలిడే'

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ పేరుతో అక్రమ వసూళ్లు
- 30 మంది నుంచి రూ. 30 లక్షలు స్వాహా

బర్కత్‌పుర, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అబుదాబిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు వీసా, విమాన టికెట్లు ఇప్పిస్తామని అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఓ సంస్థ బిచాణా ఎత్తేసింది. ఎస్‌ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బిగూడలో ఘంటసాల సుభాష్‌శర్మ లోటస్ హాలిడే సంస్థను నిర్వహిస్తున్నాడు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలు అబుదాబిలో జరుగుతున్నాయని వీసా, విమాన టికెట్ల కోసం సుమారు 30 మంది నుంచి రూ. 30 లక్షల వసూలు చేశారు. వీసా, విమాన టికెట్లు ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సుభాష్ శర్మపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కొన్ని రోజుల నుంచి సంస్థకు తాళం వేసి ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

ముషీరాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. బోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ నిరంజన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వెనుకబడిన కులాల అభ్యున్నతికి అంకిత భావంతో కృషిచేస్తున్నారని అన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న వాజీద్ హుస్సేన్



దివ్యాంగుడితో బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న మాజీ మంత్రి కృష్ణాయాదవ్

పటేల్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

అంబర్‌పేట్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్‌లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణం చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మదీ ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యశ్వంత్, మైలారం రాజు, భిక్షపతి, కృష్ణగౌడ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హౌస్ అరెస్ట్‌పై నాయకుల నిరసన

రాంనగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠాజైసింహ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయనతో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేసి బొల్లారం స్టేషన్‌కు తరలించారు. ఎం. నాగేష్ ముదిరాజ్‌ను బండ్లగూడ పోలీస్ స్టేషన్‌కు, నగర సీనియర్ నాయకుడు వి. సుధాకర్‌గుప్తాతోపాటు పలువురిని అరెస్ట్ చేసి నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వల్లాల శ్రీనివాస్‌యాదవ్, అరుణ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, డి. రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ ఆస్పత్రి వద్ద అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు.



నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

'గాంధీ' వద్ద నేతలను అడ్డుకున్న పోలీసులు

ముషీరాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై అధ్యయనం చేసేందుకు మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య నేతృత్వంలో ఏర్పడిన నిజ నిర్ధారణ కమిటీ సోమవారం గాంధీ ఆస్పత్రికి వెళ్లింది. కమిటీకి మద్దతుగా ఆస్పత్రిలోకి వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, సాయిచాణిక్య, సుధాకర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నారాయణగూడ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న

కళాకారులకు బీఆర్ఎస్ అన్యాయం

రాంనగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరని అన్యాయం చేశారని తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని జేఏసీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ కారుల కళావేదిక (టీయేకేవీ) ఆవిర్భావ సమావేశం డోలక్ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కళాకారులు ఎంతో కృషి చేశారని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వారికి ఎలాంటి చేయూతనందించలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులవేదిక ద్వారా మలిదశ కళాకారుల డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. కళాకారులకు ఉద్యోగం, పెన్షన్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫూల్‌రాంరెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, అన్వర్ పటేల్, రంగారెడ్డి, డప్పుస్వామి, గంటి చంద్రుడు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

రాంనగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక సంఘాలు నాయకులు శివం రద్దులోగల కేంద్ర కార్మిక శాఖ రీజనల్ కార్యాలయంలో సోమవారం ధర్నా చేశారు. నాయకులు తమ డిమాండ్ల పత్రాన్ని అధికారులకు అందజేశారు. ధర్నాలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు బాబర్ సలీం పాషా, విజయ్‌కుమార్ యాదవ్, నాగన్నగౌడ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, పీఎఫ్, గ్రాట్యుటీ, వారాంతపు సెలవు, అదనపు పనికి అదనపు వేతనం, కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

'సబ్బని సాహిత్య వ్యాసములు' ఆవిష్కరణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మహనీయులను స్మరించుకుని వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే ప్రయత్నం జరగడం అభినందనీయమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డా.సబ్బని లక్ష్మీనారాయణ రచించిన సబ్బని సాహిత్య వ్యాసములు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను సత్కరించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజహితం కోసం పనిచేసిన మహనీయులను స్మరించుకుంటూ వ్యాసాలు రాయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంకెనపల్లి నాగేంద్రశర్మ, సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, బైస దేవదాస్, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

డెలివరీ లొకేషన్ షేర్ చేయమంటూ సందేశం

- ఇండియన్ పోస్టల్ శాఖ పేరుతో లింక్
- మొబైల్ హ్యాక్ చేసి, రూ. 1.55 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఫెడెక్స్, సీబీఐ, ఈడీ వంటి సంస్థల పేరుతో కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు ఇండియన్ పోస్టల్ సర్వీస్ పేరును కూడా దుర్వినియోగం చేస్తున్నారు. మీ పార్సిల్ డెలివరీ చేసేందుకు లొకేషన్ షేర్ చేయమంటూ సందేశం పంపిన సైబర్ నేరగాళ్లు బాధితుడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 1.55 లక్షలు కాజేశారు. మీకు వచ్చిన పార్సిల్ కోసం డెలివరీ లొకేషన్ షేర్ చేయమని, లేకపోతే పార్సిల్ రిటర్న్ అవుతుందని నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి ఫోన్‌కు సందేశం వచ్చింది. పార్సిల్ కోసం ఎదురు చూస్తున్న అతడు లింక్ ఓపెన్ చేశాడు. ఇండియన్ పోస్టల్ పేరుతో ఉన్న వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేశాడు. డెలివరీ కోసం రూ. 25 క్రెడిట్ కార్డు నుంచి చెల్లించాడు.

కొద్దిసేపటి తర్వాత మీ ఖాతా నుంచి డబ్బులు బదిలీ అయ్యాయన్న సందేశం రాగానే క్రెడిట్ కార్డును బ్లాక్ చేశాడు. బ్యాంకు అధికారులను సంప్రదించగా.. గుర్తుతెలియని వ్యక్తులు అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 1.55 లక్షలు కాజేసి దుబాయ్‌లో ఉన్న ఖాతాలో జమ చేశారు. సైబర్ నేరగాళ్లు మోసం చేశారని తెలుసుకున్న బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రయాల్లో ఆరితేరిన లేడీ డాన్

- సంధ్యాబాయి అరెస్ట్.. 2 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాల్లో ఆరితేరి ధూల్‌పేట లేడీ డాన్‌గా పేరుగాంచిన సంధ్యాబాయిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సంధ్యాబాయి గత కొంతకాలంగా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి కొనుగోలు చేసి ధూల్‌పేట కేంద్రంగా విక్రయిస్తోంది. ధూల్‌పేటలో పోలీసుల దాడులు పెరగడంతో ఆమె మకాం మార్చి ఐటీ కారిడార్‌లో గంజాయి విక్రయాలు చేస్తోంది. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆమె ఇంటిపై దాడి చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు అరెస్ట్ చేసిన సంధ్యాబాయి

పారిశ్రామిక రంగంలో..

'ఎనర్జీ-ఎఫిషియెన్సీ టెక్నాలజీ మరింత పెరగాలి'

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో ఎనర్జీ-ఎఫిషియెన్సీ టెక్నాలజీ మరింత పెరగాలని, ఉత్పాదకత పెంచడంతో పాటు పర్యావరణంపై ప్రభావం లేని వస్తువుల తయారీకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శక్తి సమర్థవంతమైన పద్ధతులు అవలంబించాలని సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్, డాన్ ఫోస్ లిమిటెడ్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. పారిశ్రామిక రంగంలో ఇంధన సమర్థత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) సహకారంతో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సోమవారం మాదాపూర్‌లో వర్క్‌షాప్ నిర్వహించింది.

కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో పోటీతత్వాన్ని కొనసాగిస్తూనే దీర్ఘకాలిక సుస్థిరతను పెంపొందించే భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. మెరుగైన ఇంధన సామర్థ్యం, వాతావరణ మార్పుల ఉపశమనం దిశగా పరిశ్రమలకు మార్గనిర్దేశం చేయడంలో బీఈఈ కీలక పాత్ర పోషిస్తుందని బీఈఈ డైరెక్టర్ శ్యాం సుందర్ తెలిపారు.

'ఆహార కల్తీపై వినియోగదారుల్లో చైతన్యం అవసరం'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీపై వినియోగదారుల్లో చైతన్యం అవసరమని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం మధ్యాహ్నం గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిన అంశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. 100 లీటర్ల పాలలో నుంచి 5 కిలోల స్వచ్ఛమైన నెయ్యి లభిస్తుందని, 320 రూపాయలకు కిలో నెయ్యి ఎలా లభిస్తుందో వినియోగదారులు ఆలోచించాలన్నారు. సమావేశంలో మండలి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి పల్లెపాడు దామోదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘం కార్యవర్గం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ. ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా జె. బాలయ్య, ఉపాధ్యక్షులుగా నర్సిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నాగేందర్, కోశాధికారిగా డాక్టర్ ప్రవీణ్‌రాజు, మహిళా విభాగం కార్యదర్శిగా రోజారాణి, కార్యవర్గ సభ్యులుగా జి. లక్ష్మి, ఎస్ శ్రీనివాస్, ఇఫ్తికార్ హమ్మద్, కె. ఆనంద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు జి. రామానుజాచారి, డాక్టర్ చిరంజీవి తెలిపారు.

రైలులో ప్రయాణికుడికి మత్తు బిస్కెట్లు ఇచ్చి..

ఏడు తులాల బంగారు నగలు చోరీ

బర్కత్‌పుర సెప్టెంబర్ 23 (ఆంధ్ర జ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు రైలులో ప్రయాణికుడికి మత్తు మందు కలిపిన బిస్కెట్లు ఇచ్చి ఏడు తులాల బంగారు నగలను కాజేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం హసన్‌పర్తికి చెందిన రైతు సిద్దేశ్(49) కుమారుడు నగరానికి వలస వచ్చి బేకరీ నిర్వహిస్తున్నాడు. కుమారుడిని చూడటానికి నగరానికి వచ్చిన సిద్దేశ్ తిరుగు ప్రయాణంలో ఈ నెల 18వ తేదీ రాత్రి 7 గంటలకు కాచిగూడ నుంచి మైసూర్ వెళ్లే రైలు ఎక్కాడు. అతడికి రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ఆగంతుకుడు పరిచయమయ్యాడు. జనరల్ బోగీలో సీటు ఉందని నమ్మించి సిద్దేశ్‌ను ఆ భోగిలోకి తీసుకెళ్లాడు. ఆయన సీట్లో కూర్చున్న తర్వాత మరో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు పరిచయమయ్యారు. వీరందరూ కలిసి సిద్దేశ్‌ను మాటల్లో పెట్టి మత్తు మందు కలిపిన బిస్కెట్లు తినిపించారు. సిద్దేశ్ మత్తులోకి జారుకున్న తర్వాత అతడి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, చేతి వేళ్లకు ఉన్న మూడు ఉంగరాలను కాజేసి పారిపోయారు. హసన్‌పర్తి వెళ్లిన తర్వాత మత్తులో నుంచి తేరుకున్న సిద్దేశ్ సోమవారం రాత్రి నగరానికి వచ్చి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కళాకారులను సత్కరించిన అతిథులు

భారతీయ సంస్కృతిలో

గురుశిష్య పరంపరకు ప్రత్యేక స్థానం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో గురుశిష్య పరంపరకు ప్రత్యేక స్థానం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ సహకారంతో నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తెలుగు వర్సిటీలో జరిగిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. చక్కటి హావభావాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్, వసుంధర, విజయ్‌కుమార్ కళాకారులను సత్కరించి అభినందించారు. విద్యార్థి దశలోనే పిల్లలు శాస్త్రీయ నృత్యాలపై ఇష్టం పెంపొందించుకోవాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

అలరించిన 'అక్కినేని యుగళ మధురిమలు'

రవీంద్రభారతి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అక్కినేని గీతాలాపనతో గాయనీగాయకులు ఓలలాడించారు. సోమవారం రవీంద్రభారతిలో శోభా ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని యుగళ మధురిమలు పేరిట సంగీత విభావరి నిర్వహించారు. పలువురు గాయనీగాయకులు అక్కినేని చిత్రాల్లోని పాటలను ఆలపించి అలరించారు. ఎస్వీ రామారావు, వెంకటేశ్వరి, లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు శోభారాణిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్కినేని సినీ గీతాలను గాయకులు చక్కగా ఆలపించారని కొనియాడారు. అక్కినేని జీవితం ఆదర్శప్రాయమని అన్నారు.

మరుగుదొడ్ల మాటున అక్రమార్జన

- పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
- పలువురు లూ కేఫే నిర్వాహకుల డిమాండ్

పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన లూ కేఫే ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు లూ కేఫే నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లికి చెందిన శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, లూ కేఫే నిర్వాహకులు అనిల్, భరత్ వివరాలు వెల్లడించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులలో ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్లు పిలవగా బిహార్‌కు చెందిన ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత అభిషేక్‌నాథ్ అప్పటి ప్రభుత్వ పెద్దలు కేటీఆర్, సోమేశ్‌కుమార్, అరవిందకుమార్ సహకారంతో కాంట్రాక్టు దక్కించుకున్నాడని అన్నారు. శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో డివిజన్‌కు 13 చొప్పున సుమారు వందకు పైగా లూ కేఫేలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిందని, వాటి నిర్వహణ చూస్తామని చెప్పి ఒక్కో లూ కేఫేను రూ. 20 వేల నుంచి లక్ష రూపాయల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని నెలకు ఎనిమిది నుంచి పది వేలకు పైగా చెల్లించే విధంగా వేరే వారికి కట్టబెట్టారని అన్నారు. ఒక్కో కేఫేకు జీహెచ్ఎంసీకి సంవత్సరానికి కేవలం రూ. 1,385 మాత్రమే కడుతూ తమ వద్ద నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నాడని, అతడు నెలకు కోటి రూపాయల వరకు సంపాదిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి అతడి సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి తమకే వాటి నిర్వహణ అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

లూ కేఫేల చుట్టూ యాడ్స్ ప్రదర్శిస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఒక్కో కేఫేకు సుమారు రూ. 3.40 లక్షలు జీహెచ్ఎంసీ వెచ్చిందన్నారు. వీటి నిర్వహణ, తదితర వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించామని, తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. సమావేశంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, అనిల్